క్లుప్తంగా

మెరుగైన బోధన కోసం ట్యాబ్‌ల పంపిణీ



హరిపాలెం ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: విద్యార్థులకు డిజిటల్ బోధనపై అవగాహన కల్పించడం,జాతీయ స్థాయిలో ఉన్న కంటెంట్‌ను తెలుసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లను పంపిణీ చేస్తుందని హరిపాలెం సర్పంచ్ మారిసెట్టి లక్ష్మీ కాంతం,సూర్యనారాయణ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాలలో శనివారం 39 మందికి బైజూస్ టాబ్‌లను పంపిణీ చేశారు. తరగతి గదిలోనూ, ఇంటి వద్ద విద్యార్థులు ట్యాబ్‌లోని కంటెంట్‌ను చదివి మంచి మార్కులు,తద్వారా మంచి భవిష్యత్‌ను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీపాద రవి, ఎంపీటీసీ జ్యోతిర్మయి ప్రసాద్, రాము, సూరిబాబు, అప్పారావు, రాము,శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిగుండం తొక్కిన భక్తులు



అగ్ని గుండాలు తొక్కుతున్న భక్తులు

అచ్యుతాపురం: మండలంలోని ఎర్రవరంలో మార్గశిర మాస ముగింపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి భక్తులు అగ్ని గుండాలు తొక్కారు. అర్చకులు కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్తీక మాసంలో 60 మంది భవానీ మాలలు ధరించారు. 41 రోజుల దీక్షలు పూర్తి చేసిన సందర్భంగా అమ్మవారి అనుపు మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గంప శూలం, బుగ్గ శూలం ధరించిన భవానీ మాలధారణ భక్తులు అగ్నిగుండం తొక్కారు. సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మీరాము, అగ్గాల భాస్కర్‌రావు, హనుమంతరావు, కనకారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



కోటవురట్ల సచివాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది

కోటవురట్ల : అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు తమ డిమాండ్ల పత్రాలను ఆయా సచివాలయాల పరిధిలో వెల్ఫేర్ అసిస్టెంట్లకు అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వం స్పందించాలని కోరారు.

ముమ్మరంగా వరికోతలు



కట్టుబోలు సమీపంలో వరికోత పనులు

రాంబిల్లి : మిచాంగ్ తుపానుతో పలు గ్రామాల్లో వరి పంట నష్టపోయిన రైతుల జాబితాలను అధికారులు ప్రభుత్వానికి పంపారు. ఈ నేపథ్యంలో దెబ్బతినకుండా వున్న వరిపంటను రైతులు కోసి ఆరబెట్టి కుప్పలు వేస్తున్నారు. ముమ్మర పనుల నేపథ్యంలో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో రైతులు ఇతర మండలాల నుంచి కూలీలను ఆటోలు, ఇతర వాహనాల్లో తీసుకువచ్చి పనులు చేయిస్తున్నారు. మరో పది రోజుల్లో ఈ పనులు పూర్తి అయ్యే అవకాశాలున్నాయి.

జగన్మోహిని అవతారంలో వేంకటేశ్వరస్వామి



అనకాపల్లి : స్థానిక గాంధీ నగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా స్వామి వారు శనివారం భక్తులకు జగన్మోహిని అవతారంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి గోపలాచార్యులు (చక్రవర్తి) మాట్లాడుతూ జగన్మోహిని అవతారంలో స్వామి దర్శనం లభించడం ఈ ఆలయంలోనే జరిగిందన్నారు. ఎక్కడైనా ఉత్సవమూర్తులను మాత్రమే అలంకరిస్తారని ఆయన తెలిపారు. స్వామివారి అవతారం జనవరి 1వ తేదీ వరకూ ఉంటుందన్నారు.

ఆటలతో ఆనందం...ఆరోగ్యం

• ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



యువకులతో బ్యాడ్మింటన్ ఆడుతున్న చిక్కాల రామారావు



దార్లపూడి గ్రామంలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



కొరుప్రోలులో క్రికెట్ ఆడుతున్న దృశ్యం



ఉమ్మలాడలో షటిల్ ఆడుతున్న మహిళలు



ఉమ్మలాడలో షటిల్ ఆడుతున్న పురుషులు



తిమ్మరాజుపేటలో క్రికెట్ పిచ్ ఏర్పాటు పనులు

పాయకరావుపేట : యువత, విద్యార్థులు ఆనందంతో పాటు ఆరోగ్యం కూడా వుంటుందని ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు అన్నారు. ఆడుదాం - ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో గల ఆయా గ్రామాల్లో బ్యాట్‌మింటన్ ఆటలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆడుదాం - ఆంధ్రా ఆటల పోటీల వల్ల గ్రామీణ స్థాయిలో వున్న క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి, రాష్ట్ర స్థాయిలో వారికి గుర్తింపు తీసుకురావడం సాధ్యపడుతుందని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో కూడా అభిరుచి కనబరిస్తే ఆనందం, ఆరోగ్యం సొంతమవుతుందని అన్నారు. పెంటకోట, ఎస్.నర్సాపురం, గోపాలపట్నం గ్రామాల్లో బ్యాడ్మింటన్ ఆటను ప్రారంభించి, క్రీడాకారులతో కొంతసేపు ఆటల్లో పాల్గొన్నారు. మండలంలో 110 జట్లు పురుషులు, 56 మహిళా జట్లు క్రీడల్లో పాల్గొంటున్నారు.

దార్లపూడిలో షటిల్ పోటీలు

ఎస్.రాయవరం: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడలు పోటా పోటీగా నిర్వహించారు. మేజర్ గ్రామ పంచాయతీలో గల రెండు సచివాలయాల పరిధిలో క్రీడలు శనివారం పోటీతత్వం కనబరుస్తూ నిర్వహించారు. యువత ఎక్కువ శాతం షటిల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు. కొరుప్రోలు గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రీడలు నిర్వహించే పాఠశాల ముఖ ద్వారాలకు ఆడుదాం ఆంధ్రా ఆహ్వాన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు

ఉమ్మలాడలో...

మునగపాక: మండలంలోని పలు చోట్ల ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఉమ్మలాడ సచివాలయ పరిధిలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా షటిల్ బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగం నుంచి రెండు జట్లు. మహిళల విభాగం నుంచి రెండు జట్ల మధ్య పోటీలు జరిగాయి. పండగ వాతావరణంలో క్రీడలు జరుగుతున్నాయి. తిమ్మరాజుపేటలో జనవరి 2,3,4 తేదీల్లో జరగనున్న క్రికెట్ పోటీలకు సంబంధించి ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ పర్యవేక్షణలో శనివారం పిచ్ ఏర్పాటు పనులు జరిగాయి.

గోకివాడలో...

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గోకివాడలో శనివారం బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీటీసీ అల్లవరపు నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ ద్వారపురెడ్డి గోవిందరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు మండల స్థాయిలో తలపడనున్నారు.

అయ్యప్ప ఆలయానికి అయోధ్య రాముని అక్షింతలు



అచ్యుతాపురం అయ్యప్ప దేవాలయానికి చేరుకున్న శ్రీరామ స్పర్శిత అక్షింతలతో భక్తులు

అచ్యుతాపురం : అయోధ్య నుంచి తీసుకొచ్చిన శ్రీరామ స్పర్శిత అక్షింతలను శనివారం అచ్యుతాపురం అయ్యప్ప స్వామి ఆలయానికి చేర్చారు. అక్షింతలను ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేద మంత్రోచ్చారణతో పూజించి శ్రీరామ్, జైరామ్, జై జై రామ్ అని పూజించాలని నిర్వాహకులు తెలిపారు. జనవరి ఒకటో తేదీ నుంచి 15 వరకూ గ్రామంలోని అన్ని ఇళ్లకు పంపించనున్నట్లు తెలిపారు. అయోధ్య తీర్థ క్షేత్ర మండల ధర్మ రక్షా సమితి సభ్యుల పర్యవేక్షణలో 22వ తేదీన రామాలయంలో పూజలు చేయించి, ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు వీక్షించేలా కార్యక్రమం రూపొందించారు. సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు, రామ భక్తులు పాల్గొన్నారు.

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



పశువైద్యాధికారులకు కార్యక్రమం గురించి వివరిస్తున్న ఏడీ సింహాద్రప్పడు

కోటవురట్ల : జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టరు సింహాద్రప్పడు సూచించారు. స్థానిక పశు వైద్యశాఖ కార్యాలయంలో పశు వైద్యాధికారులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించి జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 2 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయనున్నట్టు తెలిపారు. కోటవురట్ల మండలానికి 14,050 డోసులు, మాకవరపాలెం మండలానికి 12,850 డోసుల టీకా మందు వచ్చినట్టు తెలిపారు. నాలుగు నెలల వయస్సు దాటిని పాడి పశువులకు ఈ టీకా వేస్తామని రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి..



చౌడువాడలో పౌరహక్కుల గురించి మాట్లాడుతున్న ఏఎస్‌ఐ సత్యనారాయణ

కోటవురట్ల: రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులను కాపాడుకునేందుకు అవగాహన తప్పనిసరి అని మండల పరిషత్ ఏవో చంద్రశేఖర్ అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చౌడువాడలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ప్రతి పౌరుడికి కొన్ని హక్కులు ఉంటాయని, వాటి గురించి తెలిసినపుడే అన్యాయంపై పోరాడే అవకాశం ఉంటుందన్నారు. సమాజంలో చట్టం పరిధిలో హక్కులను కాపాడుకుంటూ శాంతియుతంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్యనారాయణ, ఎస్సీ హాస్టల్ వార్డెన్ రాజ్యలక్ష్మి, సర్పంచ్ గోపాలకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి ఊరేగింపు



ఆంజనేయవాహనంపై స్వామివారిని తిరువీధి సేవలకు తీసుకెళ్తున్న దృశ్యం



పల్లకిలో గోదాదేవి అమ్మవారు

నక్కపల్లి : ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా ఉపమాకలో వేంకటేశ్వర స్వామివారి తిరువీధి సేవలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, అర్చనలు, నిత్యకార్యక్రమాలు నిర్వహించారు. కొండదిగువన నారద మహాముని ప్రతిష్ఠించిన క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామికి, గోదాదేవి అమ్మవారికి, స్వామివారి ఉత్సవ మూర్తులకు, ఇతర ఉపాలయాల్లో అర్చక బృందం నిత్యార్చనలు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఆంజనేయ వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవ నిర్వహించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావైలోని ఎల్లే ఇళంకిళియే ఇన్నం ఉరంగదియో 15వ పాశురాన్ని ప్రత్యేక నీరాజనాలతో సమర్పించారు. రాపత్తు అధ్యయనోత్సవాల్లో భాగంగా సాయంత్రం పుణ్యకోటి వాహనంపై స్వామివారి తిరువీధి సేవ జరిగింది. అనంతరం నాలాయిర దివ్య ప్రబంధ సేవాకాలం, విశేష ప్రసాద నివేదనలు తీర్థ గోష్ఠి ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమాల్లో ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చక స్వాములు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు , రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు, స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం



పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ టీవీలు

నక్కపల్లి: దేవవరం పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను సర్పంచ్ గొర్ల రాఘవ కుమారి శనివారం పంపిణీ చేశారు. ఇక్కడ ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 30 మందికి ప్రభుత్వం ఒక్కొక్కటి రూ.30వేలు విలువ గల ట్యాబ్‌లను అందజేసింది. హెటిరో కంపెనీ యాజమాన్యం సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. పాఠశాలకు నాడు నేడు పథకంలో భాగంగా ఒక్కొక్కటి రూ.2.50 లక్షల విలువైన 6 డిజిటల్ టీవీలను ప్రభుత్వం సమకూర్చింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఒకప్పుడు కూర్చొనేందుకు సరైన బెంచీలు, చదువుకునేందుకు సరైన పుస్తకాలు లేని రోజుల నుంచి నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సదుపాయాలు కల్పించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గొర్ల నర్సింహమూర్తి, హెచ్‌ఎం నూక రాజు, ఉపాధ్యాయుడు దేవర నర్సింహమూర్తి పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు



పాటిపల్లి జగనన్న కాలనీలో ఇంటింటా కుళాయిల ఏర్పాటు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

మునగపాక : జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారం పాటిపల్లి జగనన్న కాలనీలో ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు సంబంధించిన పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆడారి త్రిమూర్తులు, వార్డు సభ్యుడు రామకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తేజ పాల్గొన్నారు.

'వైఎస్సార్ ఆసరా' మహిళలకు వరం



తిమ్మరాజుపేటలో వైఎస్సార్ ఆసరా లబ్ధిదారుల వివరాల జాబితా ప్రదర్శన

మునగపాక : వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు వరంగా మారిందని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి భర్త కృష్ణారావు అన్నారు. తిమ్మరాజుపేటలో వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు సంబంధించిన జాబితాను సచివాలయం వద్ద శనివారం ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనతను దక్కించుకున్నారన్నారు. తిమ్మరాజుపేట సచివాలయ పరిధిలో 52 గ్రూపులకు గానూ రూ.కోటి 99లక్షల 31,862 మేర రుణమాఫీ జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. ఇచ్చిన మాటను అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, వీవోఏ అప్పారావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మార్కెట్‌కు న్యూఇయర్ శోభ



యలమంచిలి పట్టణంలో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



బేకరీ దుకాణంలో విక్రయించేందుకు సిద్ధం చేసిన కేకలు

యలమంచిలి రూరల్ : ఉప్పొంగే ఉత్సాహం..అంతటా ఉల్లాసం.. యువతలో నయా జోష్. కొత్త సంవత్సరానికి కొంగొత్త రీతిలో స్వాగతం పలికేందుకు యలమంచిలి పట్టణంలో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మార్కెట్లు, వస్త్ర దుకాణాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా కొత్త సంవత్సరానికి అవసరమైన రంగులు,అలంకరణ సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. స్వీట్ దుకాణాలు షాపుల్లో వినియోగదారులకు అవసరమయ్యే కేక్‌లు స్వీట్లను ప్యాక్ చేసి విక్రయాలకు సిద్ధం చేశారు. వీటితోపాటు పూల దుకాణాలు, పండ్ల షాపుల్లో అమ్మకాలకు ఏర్పాట్లు చేసుకున్నారు. గులాబీలతో తయారు చేసే పూల బొకేలకు గిరాకీ ఉండడంతో సాధారణ రోజులతో పోల్చితే ఇప్పుడు ధరలు ఎక్కువగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇళ్ల వాకిళ్లలో అందమైన రంగవల్లులు తీర్చి దిద్దేందుకు రంగుల అమ్మకాలు ఊపందుకున్నాయి.

అంగన్‌వాడీల వినతి



సచివాలయ ఉద్యోగులకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మునగపాక : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులకు వినతి పత్రం అందజేశారు. వెంకటాపురంలో సీఐటీయూ నేత గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 18 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు పలు రకాలుగా ఆందోళన చేస్తున్నారన్నారు. వారి కనీస సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తిరుప్పావై పారాయణం



శ్రీదేవి , భూదేవి సమేత వల్లభనారాయణస్వామి



తిరుప్పావై పారాయణం చేస్తున్న భక్తులు

రాంబిల్లి : దిమిలిలో వల్లభనారాయణస్వామి ఆలయంలో తిరుప్పావై పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి వార్లకు నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరణ చేశారు. వేకువజాము పూజలు అనంతరం భక్తులు తిరప్పావై పారాయణం ఆలపిస్తున్నారు. ధనుర్మాసంలో తిరుప్పావై పారాయణానికి ప్రత్యేకత ఉందని అర్చకుడు రామచంద్రాచార్యులు పేర్కొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు



ఎమ్మెల్యే బాబూరావును సత్కరిస్తున్న నక్కపల్లి యూత్ విభాగం అధ్యక్షుడు నాగ అప్పలరాజు

ఎస్.రాయవరం : నక్కపల్లి వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకి రుణపడి ఉంటానని నక్కపల్లి యూత్ అధ్యక్షుడు గొర్ల నాగ అప్పలరాజు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయంలో శనివారం పాయకరావుపేట ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి దుస్సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం నిజాయతీగా కష్టపడిన వారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ గుర్తింపు నిస్తారని అన్నారు. కార్యక్రమంలో నక్కపల్లి మండలం పార్టీ అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, నాయకులు గొర్ల బాబూరావు, చంద్రరావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి

మునగపాక : ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. వెంకటాపురంలో అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన డాక్టర్ తరుణ్ ఆధ్వర్యంలో శనివారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. తల, మెదడు, ఊపిరితిత్తుల క్యాన్సర్ పురుషుల్లోనూ అలాగే సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ మహిళల్లోనూ సోకుతుందన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు తగు సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ ఉమాచంద్రిక, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి,ఆశ కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

ఆలయానికి హార్మోనియం వితరణ



ఆలయ కమిటీ సభ్యులకు హార్మోనియం అందజేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి : అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం సంతోషమాత అమ్మవారి 47వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తన సొంత నిధులతో అమ్మవారి ఆలయానికి హార్మోనియం అందజేసిన రత్నాకర్, అచ్యుత దంపతులు మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పీలా రాంబాబు, విల్లూరి ప్రసాద్, కాండ్రేగుల వెంకట సాంబశివరావు, పెతకంశెట్టి గోపి, కొణతాల గోవింద, మల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వన సమారాధనకు ఆహ్వానం

అనకాపల్లి : జీవీఎంసీ గవరపాలెం చిన్నహైస్కూల్‌కు చెందిన 1972–75 బ్యాచ్ పూర్వ విద్యార్థుల వన సమారాధన ఆదివారం ఉదయం 9 నుంచి 5 వరకూ జరుగుతుందని సంక్షేమ సంఘం అధ్యక్షుడు బల్లా నాగభూషణం, కార్యదర్శి దాడి శివరామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొప్పాక గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ఎదురుగా ఉన్న జెమిని డ్రింక్స్ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి పైన పేర్కొన్న సంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

అనకాపల్లి : అనకాపల్లి ఏరియా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ వనభోజన కార్యక్రమం ఆదివారం మండలంలో సత్యనారాయణ పురం మామిడితోటలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కనికెళ్ల కోటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ సభ్యులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.